1
నవతెలంగాణ
నిజామాబాద్-కామారెడ్డి
బుధవారం | మే 15, 2024 | www.navatelangana.com

రోటరీ ఆధ్వర్యంలో యువతకు భవిష్యత్తుపై అవగాహన

నవతెలంగాణ-కామారెడ్డి

రోటరీ క్లబ్ ఆఫ్ కామారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం మంజీరా డిగ్రీ కళాశాలలో యువతకు యువత - భవిష్యత్తు - అవగాహన అనే కార్యక్రమంపై మోటివేటర్ కోడిప్యాక సత్యనారాయణ ఆధ్వర్యంలో అవగాహన కల్పించరు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి అధ్యక్షులు పోలబోయిన సత్యం మాట్లాడుతూ.. యువత ఒక నిర్దిష్టమైన గమ్యాన్ని ఏర్పాటు చేసుకొని గమ్యాన్ని చేరుకొనడంలో తమ వంతు కృషి చేయాలని అన్నారు. తద్వారా భవిష్యత్తులో మంచి స్థాయిలో నిలవగలుగుతారని వివరించారు. నేటి యువతకు ఎన్నో అవకాశాలు విద్యాపరంగా, సాంకేతిక పరంగా అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి రాజనర్సింహారెడ్డి, కోశాధికారి తోర్నాల సుధాకర్, సభ్యులు వెంకటరమణ, మంజీరా కళాశాల డైరెక్టర్ గురవేందర్‌రెడ్డి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకున్న ప్రభుత్వ సలహాదారు

నవతెలంగాణ-కామారెడ్డి

మండలంలోని గర్గుల్ గ్రామానికి చెందిన అలేఖ్య శస్త్ర మెరుగైన చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి (ఎల్‌ఓసి) నుంచి రూ.5లక్షలు ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ ఆలీ షబ్బీర్ మంజూరు చేయించి బాధితులకు మంగళవారం అందజేశారు. గర్గుల్ గ్రామానికి చెందిన నారాగౌడ్ కూతురు అలేఖ్య ఆరోగ్యం బాగాలేక చాల ఆసుపత్రిలో చూపించారు. శస్త్ర చికిత్స చేయించాలని దానికి ఐదు లక్షల రూపాయలు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. ఆర్థిక స్తోమత లేని ఆ కుటుంబానికి అదే సమయంలో ఇంటి యజమాని నారాగౌడ్ మరణించడంతో నిస్సహాయులుగా ఉండిపోయారు. సర్పంచ్ ఈ విషయాన్ని షబ్బీర్ అలీ దృష్టికి తీసుకురాగా షబ్బీర్ అలీ వెంటనే స్పందించి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.5లక్షలు ఇప్పించి కుటుంబాన్ని ఆదుకున్నారు. అలేఖ్య కుటుంబం షబ్బీర్ అలీకి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు ఇంద్రకరణ్‌రెడ్డి, గూడెం శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉల్లాసంగా ఉత్సాహంగా..

- రెండు నెలలు ప్రచారంలో బిజీబిజీ
- పోలింగ్ ముగియడంతో సరదాగా గడిపిన ప్రజాప్రతినిధులు నాయకులు
- గెలుపుపై ఎవరి ధీమా వారిదే

నవతెలంగాణ-నిజామాబాద్ డెస్క్

ఎత్తులకు పైఎత్తులు.. ప్రచారంలో ప్రణాళికలు రూపొందించుకుంటూ గెలుపే లక్ష్యంగా గత రెండు నెలలుగా ప్రచారాలతో అభ్యర్థులు, నాయకులు, ప్రజాప్రతినిధులు హోరెత్తించారు. ఊరు, వాడా కలియ తిరుగుతూ పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా ఎండను సైతం లెక్కచేయకుండా ప్రచారంలో బిజీబిజీగా గడిపిన నాయకులు, ప్రజాప్రతినిధులు.. పోలింగ్ ముగియడంతో మంగళవారం ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. కుటుంబీకులతో స్థానిక నాయకులతో కార్యకర్తలు సరదాగా గడిపారు. ఈ సందర్భంగా తమ వెంట ఉంటూ ప్రచారంలో పాల్గొన్న కార్యకర్తలకు, నాయకులకు, ప్రజాప్రతినిధులకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలియజేశారు. కాగా ఎవరికివారు గెలుపుపై ధీమా వ్యక్తం చేశారు.

లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగియడంతో ఆయా పార్టీల అభ్యర్థులు నాయకులు ప్రజాప్రతినిధులు ఊపిరి పీల్చుకున్నారు. దాదాపుగా గత రెండు నెలలుగా ప్రచారంలో పాల్గొంటూ ఓటర్లను కలుస్తూ తమకు ఓటు వేయాలని అభ్యర్థిస్తూ ప్రచారం చేపట్టారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో నిజామాబాద్, జహీరాబాద్ స్థానాలలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసిన విషయం తెలిసిందే. నిజామాబాద్ స్థానం నుంచి ప్రధాన పార్టీలైన కాంగ్రెస్ నుంచి జీవన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నుంచి బాజిరెడ్డి గోవర్ధన్, బిజెపి నుంచి ధర్మపురి అరవింద్ బరిలో నిలవగా, జహీరాబాద్ స్థానంలో కాంగ్రెస్ నుంచి సురేష్ శెట్కర్, బీఆర్‌ఎస్ నుంచి గాలి అనిల్ కుమార్, బిజెపి నుంచి బీబీ పాటిల్ బరిలో నిలిచారు.


బాన్సువాడ పట్టణంలోని టీస్టాల్‌లో నాయకులతో కలిసి చాయ్ తాగుతున్న మాజీ స్పీకర్

కుటుంబీకులతో కార్యకర్తలతో సరదాగా గడిపిన నాయకులు..

రెండు నెలలుగా క్షణం తీరిక లేకుండా ప్రచారంలో పాల్గొన్న అభ్యర్థులు, నాయకులు, ప్రజాప్రతినిధులు ప్రస్తుతం స్థానిక కార్యకర్తలతో సరదాగా గడిపారు. బాన్సువాడలో మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి స్థానికంగా కలియ తిరుగుతూ వచ్చారు. దుకాణంలో స్థానికులతో కలిసి చాయ్ తాగుతూ ముచ్చటించారు. జహీరాబాద్ బిజెపి అభ్యర్థి బిబి బాటిల్ కుకింగ్ పీపుల్‌తో కలిసి సరదాగా గడిపారు. నిజామాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి జగిత్యాలలో స్థానిక కార్యకర్తలతో కలిసి ముచ్చటించారు.

గెలుపు పట్ల ఎవరి ధీమా వారిదే..

పోలింగ్ ప్రశాంతంగా ముగియడంతో బూతుల వారీగా తమకు వచ్చిన ఓట్లను అభ్యర్థులు అంచనా వేస్తున్నారు. పోలింగ్ బూతుల వారీగా లెక్కలు తెప్పించుకొని ఏఏ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏవిధంగా ఓటింగ్ నమోదైందో అంచనాకు వస్తున్నారు. నిజామాబాద్‌లో గల్ఫ్ బోర్డు, షుగర్ ఫ్యాక్టరీ తెరిపించడం తదితర అంశాలు తనకు అనుకూలంగా మారినట్టు రైతులు పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీకే ఓట్లు వేసినట్టు జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. కాగా బీఆర్‌ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ గత బిఆర్‌ఎస్ హయాంలో చేపట్టిన సంక్షేమ పథకాలను ఓటర్లు గుర్తుచేసుకొని బిఆర్‌ఎస్‌కి అనుకూలంగా ఓట్లు వేశారని తన గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇక బిజెపి అభ్యర్థి ధర్మపురి అరవింద్ మోడీ మానియానే నమ్ముకున్నారు.

ఇక జహీరాబాద్‌లో మాజీ ఎంపీ సురేష్ షెట్కర్ కాంగ్రెస్ ఓటు బ్యాంకును నమ్ముకున్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన మదన్మోహన్ 6000 ఓట్ల స్వల్ప తేడాతో ఓడిపోగా ఈసారి రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండడంతో తనకు అనుకూలించే అంశంగా భావిస్తున్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి గాలి అనిల్ కుమార్ గత ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను నమ్ముకున్నారు. అయితే బిజెపి అభ్యర్థి బీబీ పాటిల్ సైతం మోడీ మానియానే నమ్ముకున్నారు. వచ్చే నెల జూన్ 4న అభ్యర్థుల భవితవ్యం తేలనుంది. పోలింగ్ ఫలితాల పట్ల సర్వత్ర ఉత్కంఠ నెలకొంది.

ఓటు వేయడంలో మహిళల ఉత్సాహం

- పురుషులకంటే 37,627 మంది మహిళలు ఓటు అత్యధిక ఓటు

నవతెలంగాణ-కామారెడ్డి

జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ఎన్నికలలో ఓటు వేయడంలో మహిళా ఓటర్లు ఉత్సాహం చూపారు. పురుషులకంటే 37,627 మంది మహిళలు అత్యధికంగా ఓట్లు వేశారు. జుక్కల్ నియోజకవర్గ పరిధిలో పురుషులు 99,524 మంది ఓట్లు వేయగా, మహిళలు 1,03,354 మంది మహిళలు ఓట్లు వేశారు. బాన్సువాడ నియోజకవర్గంలో 93,762 పురుషులు ఓట్లు వేయగా, 1,03,051 మహిళలు ఓట్లు వేశారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో పురుషులు 1,06,881 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోగా, మహిళలు 1,16,144 ఓట్లు వేశారు. కామారెడ్డి నియోజకవర్గం పరిధిలో 1,22,474 పురుషులు ఓట్లు వేయగా, మహిళలు 1,32,514 మంది ఓట్లు వేశారు. నారాయణఖేడ్‌లో 1,18,859 పురుషులు ఓట్లు వేయగా, మహిళలు 1,18,373 ఓట్లు వేశారు. ఆందోల్‌లో పురుషులు 1,22,668 మంది ఓటు వేయగా.. మహిళలు 1,28,187 మంది ఓట్లు వేశారు. జహీరాబాద్‌లో 1,37,694 మంది పురుషులు వేయగా, స్త్రీలు 1,37,866 మంది ఓట్లు వేశారు. మొత్తంగా పురుషులు 8,01,862, మహిళలు 8,39,489 మంది ఎన్నికల్లో ఓట్లు వేశారు.


ఓటు వేసేందుకు క్యూలో మహిళలు

ట్రాన్స్‌జెండర్లు జుక్కల్ పరిధిలో 9 మంది, బాన్సువాడ పరిధిలో 13, ఎల్లారెడ్డి పరిధిలో ఇద్దరు, కామారెడ్డి పరిధిలో 19, నారాయణఖేడ్ పరిదిలో తొమ్మిది, అంధోల్ పరిధిలో ఐదుగురు, జహీరాబాద్ పరిధిలో ఇద్దరు మొత్తంగా జహీరాబాద్ నియోజకవర్గం పరిధిలో 59 మంది ట్రాన్స్‌జెండర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో మొత్తంగా 74.63 శాతం నమోదైందని జహీరాబాద్ ఎన్నికల అధికారి క్రాంతి వల్లూర్ తెలిపారు.

బిడ్డ బెయిల్ కోసం బీఆర్ఎస్ తాకట్టు

- పార్టీని, క్యాడర్‌ను, తెలంగాణ ప్రజల నమ్మకాన్ని బీజేపీకి అమ్మేశారు
- కేసీఆర్‌కు సెక్యులరిజంపై మాట్లాడే హక్కు లేదు
- జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్‌కు బంఫర్ మెజారిటీ
- ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ

నవతెలంగాణ-కామారెడ్డి

గత కొద్దిరోజుల నుంచి బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేనని చెప్తూ వస్తున్నామని, అది నిజమేనని ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ అన్నారు. కవిత బెయిల్ కోసం బీజేపీతో కేసీఆర్ కుమ్మక్కు అయ్యారని చెప్పామని, ప్రస్తుతం ఎంపీ ఎన్నికల్లో అది నిజమని నిరూపణ అయిందన్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి జహీరాబాద్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన సురేష్ షెట్కార్‌కు మంచి మెజారిటీ ఉంటుందని అంచనా అంచనా వేసినట్లు ఆయన తెలిపారు. మంగళవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని క్లాసిక్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో గెలువబోయే 11 స్థానాల్లో జహీరాబాద్ ఒకటి ఉంటుందని సీఎం చెప్పారన్నారు. నారాయణ్ ఖేడ్, ఆందోల్‌లో కాంగ్రెస్ మెజారిటీ వస్తుందన్నారు. తమది ఒరిజినల్ పార్టీ అని చెప్పుకునే కేసీఆర్ పార్టీ భవిష్యత్తు 5 నెలల్లోనే భూస్థాపితం అయిందన్నారు. జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో మాత్రమే నాయకుల తీరుతో బిజెపికి ఓటు వేయించారని అనుకున్నామని, కానీ రాష్ట్రవ్యాప్తంగా ఇదే జరిగిందన్నారు. మోడీకి నార్త్ ఇండియాలో ఎదురుగాలి ఉందని, సౌత్ ఇండియాలో ప్రజలు క్లియర్‌గా ఉన్నారన్నారు. షెడ్యూల్ 71, 72, 73 ప్రకారం ఐదేళ్లకు ఒకసారి రిజర్వేషన్లు మార్చాలని, కేసీఆర్ మొండిగా దానిని పదేళ్లకు పెంచారన్నారు. మార్చి నెలలో కురిసిన రాళ్ళ వర్షానికి నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా నిలిచిందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 15 వేల ఎకరాల్లో పంట నష్టం జరిగితే కేవలం కామారెడ్డి నియోజకవర్గంలోనే 10,420 ఎకరాల్లో నష్టం వాటిల్లిందని, ఎకరానికి 10వేల చొప్పున ప్రభుత్వం 15 కోట్లు విడుదల చేస్తే 10 కోట్లకు పైగా కామారెడ్డి రైతులకు నష్టపరిహారం ఇచ్చామని తెలిపారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో ఒక్క రైతుకూ పంట నష్టం ఇవ్వలేదని, గతంలో వైఎస్ఆర్ హయాంలో పరిహారం ఇస్తే ప్రస్తుతం రేవంత్ రెడ్డి హయాంలో ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదే అన్నారు. మొన్నటి ప్రచారంలో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డికి కామారెడ్డి సమస్యలపై మెమోరాండం ఇచ్చామని తెలిపారు. ప్రాణహిత 21, 22 ప్యాకేజీ పనులకు నిధులు విడుదల చేయాలని కోరినా.. కామారెడ్డిలో తాగునీటి కోసం ప్రత్యేక పైప్‌లైన్ వేయాలని విన్నవించినా, కామారెడ్డిని ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చేందుకు పాలిటెక్నిక్, ఇంజినీరింగ్, మహిళా డిగ్రీ కళాశాల, దోమకొండకు డిగ్రీ కళాశాల, నర్సింగ్ కాలేజ్, డెయిరీ టెక్నాలజీ పిజిగా మార్పు, పారామెడికల్ కాలేజ్, ఐటీ హబ్, స్మార్ట్ సిటీ ప్రాజెక్ట్ ఇవ్వాలని కోరారు. అలాగే రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి, నూతన బస్టాండ్, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, ఇందిరాగాంధీ స్టేడియంలో ఫ్లడ్ లైట్స్, గ్యాలరీ, సౌత్ క్యాంపస్‌లో అదనపు కోర్సులు, దోమకొండలో 100 పడకల ఆస్పత్రి, కామారెడ్డిలో ఆటోనగర్, టూరిజం ఇవ్వాలని కోరారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత సంబంధిత శాఖల మంత్రులతో స్వయంగా సమీక్షించి, పనులు ఒక్కొక్కటిగా పూర్తి చేయించనున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో కామారెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్ రెడ్డి, దోమకొండ జడ్పిటిసి తిరుమలగౌడ్, బిబిపేట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుతారి రమేష్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ

71.92 శాతం పోలింగ్ నమోదు

- నిజామాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్‌లో..

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో సగటున 71.92 శాతం పోలింగ్ నమోదయ్యిందని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. మొత్తం 17,04,867 మంది ఓటర్లకు గాను 12,26,133 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారని వెల్లడించారు. ఓటింగ్‌లో పాల్గొన్న వారిలో మహిళా ఓటర్ల సంఖ్య 6,73,629 ఉండగా, పురుష ఓటర్లు 5,52,465 మంది, ఇతరులు 39 మంది ఓటు వేశారని అన్నారు. పార్లమెంటు సెగ్మెంట్ పరిధిలోని ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పోలైన ఓటింగ్‌ను పరిశీలిస్తే, ఆర్మూర్ నియోజకవర్గంలో మొత్తం 2,12,145 మంది ఓటర్లకు గాను 1,55,159 ఓటర్లు (73.14 శాతం) ఓటు హక్కు వినియోగించు కున్నారని తెలిపారు. బోధన్ నియోజక వర్గంలో 2,23,096 మంది ఓటర్లకు గాను 1,66,330 ఓటర్లు (74.56 శాతం), నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో 3,04,317 మంది ఓటర్లకు గాను 188159 ఓటర్లు (61.83 శాతం), నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో 256593 మంది ఓటర్లకు గాను 1,91,252 ఓటర్లు (74.54 శాతం), ఓటు వేశారన్నారు. బాల్కొండ నియోజకవర్గంలో 2,26,792 మంది ఓటర్లకు గాను 1,69,524 ఓటర్లు (74.75 శాతం), కోరుట్ల నియోజకవర్గం పరిధిలో 2,45,249 మంది ఓటర్లకు గాను 1,80,867 ఓటర్లు (73.75 శాతం), జగిత్యాల నియోజకవర్గంలో 2,36,675 మంది ఓటర్లకు గాను 1,74,842 ఓటర్లు (73 .87 శాతం) తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని కలెక్టర్ వివరించారు.


అర్బన్‌లో ఓటు వేసేందుకు వచ్చిన ఓటర్లు

సాలూరాలో ఆగని పేకాట

- పేకాటనే ఉపాధిగా మార్చుకుంటున్న కొందరు
- పోలీసుల నిఘా కరువు

నవతెలంగాణ-బోధన్



సాలూరా మండల కేంద్రంలోని శివారు ప్రాంతంలో ప్రతినిత్యం పేకాట జోరుగా కొనసాగుతుంది. సాలూరా శివారు ప్రాంతాలే అడ్డగా చేసుకొని పేకాటరాయుళ్లు ప్రతిరోజు స్థావరాలు ఏర్పాటు చేసుకొని ఆట నిర్వహిస్తున్నారు. దాంతో ఎందరో యువకులు పేకాట వ్యసనానికి బానిసై వేల రూపాయలు ఆటలో పోగొట్టుకుంటున్నారు. కొంతమంది పేకాటనే ఉపాధిగా మార్చుకొని యువకులను పేకాట ఆడటానికి ప్రోత్సహిస్తూ వారి కుటుంబాలను పరోక్షంగా నష్టపరుస్తున్నారు. పొద్దస్తమానం కష్టపడి సంపాదించిన డబ్బులు ఈ పేకాటలో పోగొట్టుకుంటున్నారు. దాంతో నిరుపేదల కుటుంబాలలో కలహాలు మొదలై అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. పేకాట ఇంత విచ్చలవిడిగా కొనసాగుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైనా పోలీసులు తక్షణమే స్పందించి పేకాటారాయుళ్లపై నిఘా వేసి పట్టుకోవాలని, పేకాట కొనసాగకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఉపాధ్యాయులపై లాఠీచార్జి చేయించిన అధికారులపై చర్యలు తీసుకోవాలి

- టి.పి.టి.ఎఫ్ కామారెడ్డి జిల్లా అధ్యక్షులు వై.సత్యనారాయణ

నవతెలంగాణ-కామారెడ్డి

నారాయణఖేడ్ అసెంబ్లీ సెగ్మెంట్ ప్రాంతంలో ఎన్నికల విధులు నిర్వహించిన ఉపాధ్యాయులు తమకు రావాల్సిన 5 రోజుల భత్యం రాష్ట్ర వ్యాప్తంగా ఏకరీతిగా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నందుకు, అమానుషంగా, అమానవీయంగా, రెండు రోజులు ఓపికతో విధులు నిర్వహించిన వారిపై పోలీసులతో లాఠీచార్జి చేయించాడని టీపీటిఎఫ్ కామారెడ్డి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై.సత్యనారాయణ, సిహెచ్. అనిల్ కుమార్‌లు ఖండించారు. న్యాయంగా తమకు రావాల్సిన వేతన భత్యాలను ఇవ్వాలని అడిగిన వారిపై పోలీసు బలాలతో ప్రయోగాలు చేయడం అత్యంత దారుణమని పేర్కొన్నారు. ఎన్నికల శిక్షణలో ఉపాధ్యాయులు విధుల పట్ల ఎంతో అంకితభావంతో పనిచేస్తారని పొగిడిన అధికారులే, పనులు ముగించుకున్నాక దాడులు చేయించడం అత్యంత దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనను ఖండిస్తూ, గొడవకు కారణమైన అధికారులపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నిక సంఘాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో సిబ్బందికి ఇవ్వాల్సిన రెమ్యూనరేషన్‌పై ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ కొన్ని జిల్లాల్లో మాత్రం ఆ ఆదేశాలను బేఖాతరు చేస్తూ, ఎలక్షన్ విధులు నిర్వర్తించిన సిబ్బందికి ఇచ్చే డబ్బులను తక్కువగా ఇచ్చారని తెలిపారు. కావున తక్కువగా చెల్లించిన నియోజకవర్గాలలో రెమ్యూనరేషన్ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

స్ట్రాంగ్ రూమ్‌లకు చేరిన ఈవీఎంలు

- పరిశీలకులు, ఏజెంట్ల సమక్షంలో స్ట్రాంగ్‌రూమ్‌లకు సీల్
- సీ.సీ కెమెరాల ద్వారా అనుక్షణం పర్యవేక్షణ
- సాయుధ బలగాల పహారా

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ/డిచ్‌పల్లి

నిజామాబాద్ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని 7 శాసనసభా నియోజకవర్గాలలో ప్రశాంత వాతావరణం నడుమ సాఫీగా పోలింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం, కట్టుదిట్టమైన భద్రత నడుమ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎం)ను ఓట్ల లెక్కింపు కేంద్రమైన డిచ్పల్లిలోని సీఎంసీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లకు చేర్చారు. ఆయా సెగ్మెంట్ల నుండి తరలించిన ఈవీఎంలను జాగ్రత్తగా సరిచూసుకుని స్ట్రాంగ్ రూంలలో నియోజకవర్గాల వారీగా క్రమ పద్ధతిలో అమర్చారు. ఈ సందర్భంగా మంగళవారం ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎలిస్ వజ్ ఆర్‌తో పాటు, అభ్యర్థులు వారి ఏజెంట్ల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్ లకు సీల్ వేశారు. పార్లమెంటు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్ ఈవీఎంల భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. ఎలాంటి గందరగోళం, లోటుపాట్లకు తావులేకుండా పకడ్బందీ చర్యలు చేపట్టారు. ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద సాయుధ బలగాలతో పహారా ఏర్పాటు చేశారు. ఎలాంటి అనుమానాలకు తావులేకుండా స్ట్రాంగ్ రూంలతోపాటు వాటి పరిసరాలను అనుక్షణం పరిశీలించేందుకు వీలుగా సీసీ కెమెరాలను అమర్చి, మానిటర్ల ద్వారా పర్యవేక్షణ జరిపిస్తున్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద 144వ సెక్షన్ నిషేధాజ్ఞలు అమలులోకి తెస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఓట్ల లెక్కింపు కేంద్రాల్లోకి ఇతరులెవరూ లోనికి వెళ్లకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, సీపీ కల్మేశ్వర్ ప్రతి కౌంటింగ్ హాల్, స్ట్రాంగ్ రూమ్ లను క్షుణ్ణంగా పరిశీలిస్తూ, అధికారులకు సూచనలు చేశారు. జూన్ 4న చేపట్టనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియకు ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. స్ట్రాంగ్ రూమ్ ల వద్ద ఏర్పాటు చేసిన సిసి కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షణ జరపాలన్నారు. కౌంటింగ్ కేంద్రంలో ఓట్ల లెక్కింపు విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బంది రాకపోకలకు, అభ్యర్థులు, ఏజెంట్ల రాకపోకల కోసం వేర్వేరు మార్గాలతో బారికేడ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. తాగునీరు, విద్యుత్ సరఫరా, కౌంటింగ్ టేబుల్స్, ఇతర అన్ని ఏర్పాట్లు పక్కాగా ఉండాలన్నారు. కలెక్టర్ వెంట ట్రైనీ కలెక్టర్ సంకేత్ కుమార్, సహాయ రిటర్నింగ్ అధికారులు ఉన్నారు.


ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్‌లకు తరలిస్తున్న సిబ్బంది


సిబ్బందికి సూచనలు చేస్తున్న కలెక్టర్

బెట్టింగుల జోరు

- అంతా స్మార్ట్ ఫోన్లలోనే..

నవతెలంగాణ-మాక్లూర్

క్రికెట్ సీజన్ ప్రారంభమైననాటి నుంచి గ్రామీణ ప్రాంతాల్లో ఆన్లైన్ బెట్టింగులు ఊపందుకున్నాయి. ప్రత్యేకించి యువకులు సంబంధిత యాప్ లను డౌన్లోడ్ చేసుకొని పందేలు కాస్తున్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని ఇంటి నుంచే బెట్టింగులు జరుపుతున్నారు. చేతిలో ఫోన్, అకౌంట్లో డబ్బులు ఉంటే చాలు పల్లె, పట్నం అన్న తేడా లేకుండా కొనసాగుతుంది. ఐపీఎల్ మ్యాచ్ ప్రారంభంతో ఎవరు ఎంత బెట్ కాస్తున్నారోనని ఫోన్లు ప్రారంభమవుతాయి. తర్వాత పోటీ పడుతున్న రెండు జట్ల బలాబలాల ప్రకారం బెట్టింగ్ ఉంటుంది. బలమైన జట్టుతో బలహీనమైన జట్టు పోటీలో ఉంటే బలహీనమైన జట్టు గెలుస్తుందని బెట్టింగ్ కాస్తే ఒకటికి రెండు రెట్ల డబ్బులు చెల్లిస్తారు. ఓవర్ ఓవర్‌కు, బాల్ బాల్ కు కూడా బెట్టింగ్ పెట్టుకుంటారు. బంతిని సిక్స్ కొడతాడా.. ? ఫోర్ కొడతాడా..? వికెట్ పడుతుందా..? అనే అంశాలపై బెట్టింగ్ కొనసాగుతుంది. స్మార్ట్ ఫోన్లలోనే డబ్బులు చెలింపులు జరుగుతాయి. బెట్టింగ్ వ్యవహారాల్లో యువకులు పక్కదారి పడుతూ తల్లిదండ్రులకు కన్నీరు మిగిలిస్తున్నారు. తల్లిదండ్రులు మేల్కొని తమ పిల్లలు బెట్టింగుకు పాల్పడకుండా జాగ్రత్త పడాలి. అధికారులు సైతం నిఘా ఉంచి నిర్వహించే వారిపై తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



టమాటాలో అధిక దిగుబడి

- దుఫ్లోర అగ్రి ప్రొడక్ట్ సరస్వతి గోల్డ్


టమాట పంటను పరిశీలిస్తున్న పలువురు

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన రైతు, మాజీ సర్పంచ్ బంటు దయానంద్ వ్యవసాయ భూమిలో పండించిన టమాట పంట అధిక దిగుబడిని సాధించిందని శ్రీ ఆదిత్య అగ్రో ఏజెన్సీకి చెందిన చేపూర్ శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాము కంపెనీ ప్రతినిధులతో ఇటీవల ఆయన రైతు వ్యవసాయ క్షేత్రంను సందర్శించారని తెలిపారు. కొత్త కంపెనీ వెరైటీ అని అధైర్య పడకుండా, సాటి రైతులందరికీ ఆదర్శప్రాయంగా ఉండేవిధంగా వేసి అధిక దిగుబడి సాధించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను కంపెనీ ప్రతినిధులు అభినందించినట్టు తెలిపారు.

అల్లకొండ పుస్తకం ఆవిష్కరణ


పుస్తకం ఆవిష్కరిస్తున్న పలువురు

నవతెలంగాణ-ముప్కాల్

బాల్కొండ వాస్తవ్యులు ప్రముఖ జర్నలిస్టు సోదరులు, చరిత్రకారులు, రచయిత అయిన బ్రహ్మరౌత్ నర్సింగ్ రావ్ రచించిన "అల్లకొండ ఊరు ఉద్భవం-ఐదు ఆలయాలకు ప్రసిద్ధి" అనే పుస్తకంను మంగళవారం ఆవిష్కరించారు. మండలంలోని రెంజర్ల గ్రామంలో స్థానిక రైతు ఉద్యమ నేత, తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటం చేసిన బుల్లెట్ రాంరెడ్డి చేతుల మీదుగా పుస్తకాన్ని ఆయన నివాసంలో ఆవిష్కరించారు. అనంతరం బుల్లెట్ రాంరెడ్డి మాట్లాడుతూ ఇలాంటి పుస్తకాలను మరెన్నో రచించాలని ఆకాంక్షించారు. బాల్కొండ గ్రామాన్ని ఆనాడు అల్లకొండగా పిలిచేవారని, ఆనాటి చరిత్రను ప్రస్తుత సమాజానికి తెలిసే విధంగా పుస్తకాన్ని రచించడం గొప్ప విషయమని సంతోషం వ్యక్తం చేశారు..

టీచర్లపై లాఠీచార్జ్ చేయించిన ఆర్డీఓపై చర్యలు తీసుకోవాలి

- టీఎస్ యూటీఎఫ్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఉపాధ్యాయులపై లాఠీచార్జ్ చేయించిన నారాయణఖేడ్ ఆర్డీఓపై చర్యతీసుకోవాలని టిఎస్ యుటిఎఫ్ నిజామాబాద్ శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.సత్యానంద్, ఓ.రమేష్ డిమాండ్ చేశారు. నిబంధనల ప్రకారం టిఏ, డీఏ చెల్లించాలన్నందుకు పోలీసుల బలప్రయోగం ఇలాంటి చర్యలను తీవ్రంగా ఖండిస్తూ బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉద్యోగులకు నిబంధనల ప్రకారం రెమ్యూనరేషన్ చెల్లించాలని అడిగినందుకు ఉపాధ్యాయు లపై పోలీసులతో లాఠీ చార్జి చేయించిన అధికారులపై, లాఠీలతో దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రెమ్యూనరేషన్ చెల్లింపులో తేడా ఎందుకని ప్రశ్నించినందుకు టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి టి లక్ష్మారెడ్డి, ఇతర ఉపాధ్యాయులపై ఆర్డీఓ ఆదేశాల మేరకు పోలీసులు విచక్షణా రహితంగా లాఠీచార్జి చేసి ఉపాధ్యాయులను గాయపరిచారని అన్నారు. అధికారులు నిబంధనలను పాటించకుండా, ప్రశ్నించిన ఉపాధ్యాయులపై దౌర్జన్యం చేసిన ఆర్డీఓ, పోలీసులపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు.

16న కబడ్డీ సెలక్షన్స్

నవతెలంగాణ-ముప్కాల్

ఈ నెల 16 ఉదయం 10 గంటలకు ముప్కాల్ గ్రామీణ క్రీడా ప్రాంగణం 'చైతన్య స్నేహా యువజన సంఘం' క్రీడా మైదానంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్, ముప్కాల్ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో సబ్ జూనియర్, జూనియర్ విభాగంలో 'అండర్-16, అండర్-20 బాలుర' కు సెలక్షన్స్ నిర్వహించడం జరుగుతుందని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అంద్యాల లింగయ్య, కె.గంగాధర్ రెడ్డి మంగళవారం రోజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో ఎంపికైన క్రీడాకారులకు ఈ నెల 18 నుండి జూన్ 1 వరకు కబడ్డీ శిక్షణ తరగతులు 'సమ్మర్ స్పెషల్ క్యాంపు' నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. శిక్షణ కాలంలో క్రీడాకారులకు భోజన వసతి, అకామిడేషన్ సౌకర్యాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా నలుమూలల గల క్రీడాకారులు ఈ విషయాన్ని గ్రహించాలని కోరారు. మరిన్ని వివరాలకు ఈ కింది 9989814410 సెల్ నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పస్క నరసయ్య అధ్యక్షతన సాధారణ సర్వ సభ్య సమావేశం బుధవారం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో సాయిరాం మంగళవారం తెలిపారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

చెరువులో దూకి వృద్ధురాలు ఆత్మహత్య

- అనారోగ్య సమస్యలతో..


కళావతి (ఫైల్)

నవతెలంగాణ-ఆర్మూర్

అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఓ వృద్ధురాలు చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. పట్టణంలోని మల్లారెడ్డి చెరువులో వరంగ కళావతి (70) ఆదివారం రాత్రి ఇంట్లో నుంచి బయటకు వెళ్లిపోయిందని కుటుంబ సభ్యులు తెలిపారు. సోమవారం స్థానిక మల్లారెడ్డి చెరువులో మృతదేహం కనిపించింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు శవాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

సిబిఎస్‌సి ఫలితాల్లో క్షత్రియ పాఠశాల విద్యార్థుల ప్రభంజనం


విద్యార్థులను అభినంధించిన ఉపాధ్యాయ బృందం

నవతెలంగాణ-ఆర్మూర్

సిబిఎస్ఈ పదవ తరగతి ఫలితాల్లో మండలంలోని చేపూర్ క్షత్రియ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. 97శాతం ఉత్తీర్ణతను పాఠశాల సాధించింది. పాఠశాలలో అత్యధిక ఉత్తీర్ణత సాధించారు. వెలుమల శ్రీశాంత్ 89శాతం, మైలారం వర్షిత్ రెడ్డి 84శాతం, దుబ్బాక మధురిమ 82శాతం, కొండం వేదశ్రీ 80శాతం ఇలా మరెన్నో ఉత్తీర్ణత శాతాన్ని క్షత్రియ విద్యార్థులు సాధించారు. ఈ సందర్భంగా క్షత్రియ విద్యాసంస్థల సెక్రటరీ అల్జాపూర్ దేవేందర్, కోశాధికారి అల్జాపూర్ గంగాధర్, పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మి నరసింహ స్వామి విద్యార్థులను మంగళవారం ఘనంగా సన్మానించారు. డిసెంబర్ నుండి ఫైనల్ పరీక్షల వరకు 62 రోజుల పాటు నిరంతరంగా నిర్వహించిన ఇంటెన్సివ్ కోచింగ్‌లో ప్రతి పాఠంలో నుండి ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా వివరించి, చదివించడం జరిగిందని ప్రిన్సిపల్ పి. లక్ష్మీ నరసింహస్వామి తెలిపారు. క్షత్రియ విద్యా సంస్థల చైర్మన్ అల్జాపూర్ శ్రీనివాస్ తమ సందేశంలో సిబిఎస్ఇ పదవ తరగతిలో ఈ ఫలితాలు రావడం మామూలు విషయం కాదని పేర్కొన్నారు. ఇంతటి ఘనత సాధించిన విద్యార్థులకు అధ్యాపకులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కోలాహలం

నవతెలంగాణ-ఏర్గట్ల

ఏర్గట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2011-2012 లో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు అందరు ఒకే చోట చేరి సందడి చేశారు. వారి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ.. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. వారికి విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. అనంతరం విద్యార్థులనుద్దేశించి గురువులు మాట్లాడుతూ...మేము బోధించిన పాఠాలు జీవితంలో మీకు మంచి అనుభవాలుగా ఉయోగపడ్డాయని, జీవితంలో మరెన్నో ఉన్నత స్థానాలను అధిరోహించాలని కోరుకుంటున్నామని తెలిపారు.


ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

పార్లమెంట్ ఓటింగ్‌లో నారీమణులదే పైచేయి

- మండలంలో 34,346 మంది ఓటర్లు
- పురుషులు 15,937, మహిళలు 18,409
- పోలైన ఓట్లు 25,703, 74.84 శాతం ఓటింగ్
- ఓటు వేసిన పురుషులు 10,623, మహిళలు 15,080
- పురుషుల కంటే 18శాతం అధికంగా మహిళల ఓటింగ్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలో జరిగిన పార్లమెంట్ ఎన్నికల ఓటింగ్ లో నారీమణులే పై చేయి సాధించారు. ఈ ఎన్నికల్లో 74.84 శాతం ఓటింగ్ అవ్వగా మొత్తంగా 25,703 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. వీరిలో పురుషులు 10623మంది, మహిళలు 15080మంది ఉన్నారు. పురుషుల కంటే మహిళా ఓటర్లు 18 శాతం అధికంగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. మండల పరిధిలో 13 గ్రామ పంచాయతీలతో పాటు రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలం మానాల గ్రామంతో కలిపి 38 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. మొత్తంగా మండల పరిధిలో 34,346 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 15,937 మంది, 18409 మంది మహిళల ఓటర్లు ఉన్నారు. మండల పరిధిలో 115 బూత్ నుండి 152 బూత్ వరకు 38 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఉప్లూర్‌లో మొత్తం 3908మంది ఓటర్లు ఉండగా 2895 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇందులో 1812 మంది పురుషులకు గాను 1250 మంది, 2096 మంది మహిళలకు గాను 1735 మంది మహిళలు ఓటు వేశారు. రాజరాజేశ్వరి నగర్‌లో మొత్తం 350మంది ఓటర్లు ఉండగా 280 మంది ఓటు వేశారు. ఇందులో 157 మంది పురుషులకు గాను 107 మంది, 193 మంది మహిళలకు గాను 173 మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. కమ్మర్‌పల్లిలో మొత్తం 5863మంది ఓటర్లు ఉండగా 4267 మంది ఓటు వేశారు. ఇందులో 2740 మంది పురుషులకు గాను 1869 మంది, మహిళలు 3123 మందికి గాను 2398 మంది ఓటేశారు. నాగపూర్‌లో మొత్తం 941మంది ఓటర్లు ఉండగా 723 మంది ఓటింగ్ లో పాల్గొన్నారు. వీరిలో పురుషులు 425మందికి గాను 290 మంది, మహిళలు 516 మందికి గాను 43 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. హస కొత్తూర్‌లో మొత్తం 3675 మంది ఓటర్లు ఉండగా 2836 మంది ఓటేశారు. ఇందులో పురుషులు 1681మంది ఉండగా 1172 మంది, మహిళలు 1994 మందికి గాను 1664 మంది ఓటేశారు. చౌట్ పల్లిలో మొత్తం 3586 మంది ఓటర్లు ఉండగా 2625 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇందులో పురుషులు 1654 మంది ఓటర్లకు గాను 1076 మంది, మహిళలు 1932 మందికి గాను 1549 మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. బషీరాబాద్‌లో మొత్తం 3,356 మంది ఓటర్లకు గాను 2481 మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. వీరిలో 1508 మంది పురుషులకు గాను 913 మంది, మహిళలు 1848 మంది ఓటర్లకు గాను 1568 మంది ఓటేశారు. కొన సముందర్‌లో మొత్తం 3040 మంది ఓటర్లు ఉండగా 2272 మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఇందులో పురుషులు 1370మందికి గాను 850 మంది, మహిళలు 1670మందికి గాను 1422 మంది ఓటేశారు. గుడి లింగాపూర్‌లో మొత్తం 56 మంది ఓటర్లు ఉండగా 50 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇందులో పురుషులు 27 మందికి గాను 24 మంది, మహిళలు 29 మందికి గాను 26 మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. అమీర్ నగర్‌లో మొత్తం 1123 మంది ఓటర్లు ఉండగా 867 మంది ఓటింగ్ వేశారు. ఇందులో పురుషులు 537 మంది ఉండగా 381 మంది, మహిళలు 586 మందికి గాను 486 మంది ఓటేశారు. నర్సాపూర్‌లో మొత్తం 1085 మంది ఓటర్లు ఉండగా 786 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. వీరిలో 503 మంది పురుషులకు గాను 299 మంది, 582 మంది మహిళలకు గాను 487 మంది ఓటింగ్ వేశారు. ఇనాయత్ నగర్‌లో మొత్తం 678 మంది ఓటర్లు ఉండగా 52 మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఇందులో పురుషులు 319 మందికి గాను 254 మంది, మహిళలు 359 మందికి గాను 308 మంది ఓటేశారు. కోనాపూర్‌లో మొత్తం 1817 మంది ఓటర్లు ఉండగా 1476 మంది ఓటేశారు. ఇందులో 862 మంది పురుషులకు గాను 637 మంది, 955 మంది మహిళలకు గాను 839 మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. బాల్కొండ నియోజకవర్గంలోని రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలం మానాల గ్రామంలో నాలుగు పోలింగ్ కేంద్రాల పరిధిలో మొత్తం 4869మంది ఓటర్లు ఉన్నారు. 3533 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇందులో పురుషులు 2342 మందికి గాను 1541 మంది, మహిళలు 2526 మందికి గాను 1992 మంది ఓటు వేశారు.


ఓటు వేయడానికి క్యూలో నిలబడిన ఓటర్లు



గుడి లింగాపూర్‌లో అత్యధికంగా 89.28 శాతం పోలింగ్

పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా జరిగిన ఓటింగ్‌లో మండల పరిధిలో 74.84 శాతం పోలింగ్ జరిగింది. గ్రామాల పరంగా చూస్తే గుడి లింగాపూర్‌లో అత్యధికంగా 89.28 శాతం పోలింగ్ నమోదయ్యింది. మండలంలో రెవెన్యూ గ్రామమైన గుడి లింగాపూర్‌లో 56 మంది ఓటర్లకు గాను 50 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. కేవలం ఆరుగురు మాత్రమే ఓటింగుకు దూరంగా ఉన్నారు. గుడి లింగాపూర్ 89.28 శాతంతో మొదటి స్థానంలో నిలువగా నర్సాపూర్ 72.44 శాతంతో చివరి స్థానంలో నిలిచింది. మండలంలోని మిగతా గ్రామాల వారీగా పరిశీలిస్తే ఉప్లూర్ లో 76.39 శాతం, రాజరాజేశ్వరి నగర్ లో 80 శాతం, కమ్మర్‌పల్లిలో 72.77శాతం, నాగపూర్‌లో 76.83 శాతం, హసకొత్తూర్‌లో 77.17శాతం, చౌట్‌పల్లిలో 73.20 శాతం, బషీరాబాద్‌లో 73.92 శాతం, కొన సముందర్‌లో 74.73 శాతం, అమీర్ నగర్ లో 77.20 శాతం, ఇనాయత్ నగర్‌లో 76.99 శాతం, కోనాపూర్ లో 81.23శాతం, బాల్కొండ నియోజకవర్గంలోని రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలం మానాల గ్రామంలో 72.56 శాతం పోలింగ్ నమోదయ్యింది. మొత్తంగా చూస్తే మండలంలో 34346 మంది ఓటర్లకు గాను 25703 ఓట్లు పోలవగా ఇందులో 58.67 శాతం మహిళలు, 41.33 శాతం పురుషులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. పురుషుల కంటే 18శాతం అధికంగా మహిళలు తమ ఓటు హక్కు వినియోగించుకొని ముందు నిలబడ్డారు.

మహిళల ఓటింగ్ శాతమే ఎక్కువ.....

మండలంలో మొత్తంగా 74.84 శాతం ఓటింగ్ జరుగగా అందులో మహిళల ఓటింగ్ శాతమే ఎక్కువగా ఉంది. మొత్తం 25,703 ఓట్లు పోలవ్వగా ఇందులో 41.33 శాతంతో 10623 మంది పురుషులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మహిళలు 58.67 శాతంతో 15080 మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. పురుషుల కంటే 18 శాతంతో 4457 మంది మహిళలు అధికంగా ఓటింగ్‌లో భాగస్వామ్యం అవ్వడం ద్వారా పురుషులపై నారీమణులు పైచేయి సాధించారు.

లక్షల్లో జీతాలు.. కాసుల కోసం కక్కుర్తి

నవతెలంగాణ-ఆర్మూర్

లక్షల్లో జీతాలున్నారు. కాసుల కోసం కక్కుర్తి పడే అధికారులు ఉన్నారు. ఫైలుకు ఒక రేటు.. సంతకానికి ఒక రేటు.. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లోపంతో సమయ పాలన పాటించని ఉద్యోగులు.. జిల్లాలోని డివిజన్ పరిధిలో నిత్యం చోటుచేసుకుంటున్న అధికారుల, ఉద్యోగుల తీరుపై ప్రజల్లో తీవ్ర అసహనం నెలకొంటోంది. గతంలో ఆర్డిఓగా పనిచేసిన ఒకరిని, ఐసిడిఎస్ ఇంచార్జ్ పిడిలను ఏసీబీ అధికారులకు పట్టించిన మార్పు రావడం లేదు. డివిజన్ కేంద్రంలో ఆర్డీవో డీఎల్పిఓ, పంచాయతీరాజ్ ,పోలీస్ ,ఫారెస్ట్ వ్యవసాయ, తహసీల్దార్, ఆర్‌టిఓ, సబ్ రిజిస్టర్, ఎక్సైజ్ తదితర కార్యాలయాలు ఉన్నాయి.



అవినీతి అనకొండగా..

జిల్లా కోపరేటివ్ ఆఫీసర్ అవినీతి అనకొండకు మారుపేరుగా వ్యవహరించిన సంఘటన రెండు నెలల కింద తీవ్ర సంచలనం రేపింది. ఆయన అక్రమాలను అవినీతిని అక్రమ వసూళ్లను భరించారే తప్ప సొసైటీ చైర్మన్‌లలో ఏ ఒక్కరు కూడా సహకార శాఖకు సమాచారం కానీ వసుళ్ళ పర్వం గురించి బయటకు చెప్పలేని పరిస్థితిని కల్పించాడు. కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో జనవరి 16న ఆయన్ను బదిలీ చేసింది. ఈయన సొంత జిల్లా శ్రీకాకుళం నుంచి పదిమంది నిపుణులను తీసుకొచ్చి రికార్డులను ట్యాంపరింగ్ (దొంగ లెక్కలతో కొత్త రికార్డులను తయారు) చేశారు. కొత్త డిసిఓ శ్రీనివాస్ వచ్చిన రికార్డులను అప్పగించకుండా ఆయన దగ్గరే ఉంచుకోవడంతో ఫిబ్రవరి 20న కమిషనరేట్లో ఫిర్యాదు చేయడం జరిగింది.

పాలన సౌకర్యం కోసం...

గత బీఆర్ఎస్ ప్రభుత్వం రెవెన్యూ గ్రామాల ప్రతిపాదికన డివిజన్ లోని ఆలూరు, డొంకేశ్వర్ లు నూతన మండలాలుగా ఏర్పాటయ్యాయి. అటవీ శాఖలో ఒక డివిజన్ స్థాయి అధికారి తీరు తీవ్ర విమర్శలకు దారితీసింది. జిల్లా వ్యాప్తంగా టింబర్ దుకాణాలు, సామిల్లు, కార్పెంటర్ షాపుల వ్యాపారులు అటవీ శాఖ నుంచి అనుమతి తీసుకొని కట్టే వ్యాపారం చేస్తున్నారు. వీరు అటవీ శాఖ నిబంధనలకు లోబడి వ్యాపారం చేయాల్సి ఉంటుంది. అయితే ప్రతి సంవత్సరం మార్చి, ఏప్రిల్ నెలల్లో రెన్యువల్ చేసుకోవాలి. లైసెన్సుల పునరుద్ధరణకు వ్యాపారులు 5వేలతో చాలాన్ తీసి అటవీశాఖ అధికారులకు అందజేస్తారు. చాలన్ కట్టినప్పటికీ అటవీ అధికారులు టింబర్ డిపోలు, సామిల్స్, కార్పెంటర్ దుకాణాలను ప్రత్యక్షంగా తనిఖీలు చేస్తారు. అధికారుల చల్లని చూపు తమపై ఎల్లప్పుడూ ఉండేందుకు వ్యాపారులు వేలల్లో ముడుపులు అందజేయడం ఒకవైపు జరగగా... మీరు ఇచ్చినంత కాదని నేను అడిగినంత ఇవ్వాలని వ్యాపారులకు హుకుం జారీ చేసిన అధికారిపై రాష్ట్ర శాఖకు ఫిర్యాదు చేశారు. నిబంధనలు పాటించాలని ప్రజలకు చెప్పాల్సిన అధికారే అక్రమ ఇసుక రవాణాకు పాల్పడడం డొంకేశ్వర్ మండలంలో చోటు చేసుకుంది. గ్రామ పంచాయతీ ట్రాక్టర్ పంచాయతీ కార్యదర్శికి సమాచారం లేకుండానే కారోబార్ డ్రైవర్లను బలవంతం పెట్టి నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను జిల్లా కేంద్రానికి తరలించారు. దీంతో ఆయనపై డిఎల్‌పిఓ విచారణ సైతం జరిపారు. ఆలూర్ మండల తహసీల్దార్ చేతులు తడప నిదే పనులు చేయడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామీణ ప్రాంత ప్రజల సౌకర్యం నిమిత్తం కొత్త మండలాన్ని ఆయా గ్రామాలకు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్న అధికారుల్లో మార్పులు రాకపోవడం గమనర్హం. నేడు ఆర్మూర్ పట్టణ ఎంపీడీవో కార్యాలయం యందు సర్వసభ్య సమావేశం నిర్వహించనున్న తరుణంలో ఇకనుంచైనా మార్పు వచ్చేందుకు ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ప్రేమించుకున్నారు.. ఒక్కటయ్యారు..

నవతెలంగాణ-డిచ్‌పల్లి

డిచ్‌పల్లి మండలంలోని గడ్కోల్ గ్రామానికి చెందిన హరిని, ఇందల్ వాయి మండలంలోని ఇందల్ వాయి గ్రామానికి చెందిన నిఖిల్‌లు గత కొన్ని నెలలుగా ఒకరినొకరు ప్రేమించుకున్నారు. మంగళవారం హరిని కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశారు. దానిలో బాగంగా ఇరువురి కుంటుంట సభ్యులు పోలీస్ స్టేషన్‌కు చేరుకుని స్టడీ సర్టిఫికెట్‌లను ఎస్సై మనోజ్ కుమార్‌కు చూయించారు. చదువు సర్టిఫికెట్ ఆధారంగానే ఇద్దరు పెళ్ళి వయస్సులో ఉన్నట్లు గుర్తించారు. హరిని కుటుంబ సభ్యులు మాత్రం ఇంకా హరినికి నాలుగు నెలలు తక్కువగా ఉన్నాయని తెలుపగా చదువుకున్న సర్టిఫికెట్‌లలో మాత్రం 18ఏళ్ళు దాటి నట్లు ఉండటం, కుటుంబ సభ్యులు ఎంత నచ్చచెప్పిన హరిని మాత్రం నిఖిల్ తోనే ఉంటానని, ఇప్పటికే తాము ఆలయంలో పెళ్లి చేసుకున్నామని, ఒకటి రెండు రోజుల్లో రిజిస్ట్రేషన్ మ్యారేజ్ చేసుకుంటామని చెప్పారు. పోలీస్ స్టేషన్ లో సైతం ఇరువురు ప్రేమికులు పుల దండలు మార్చుకున్నారు.


పోలీస్టేషన్‌లో ఒక్కటైన ప్రేమ జంట

ముగిసిన పార్లమెంట్ పోరు..

ఊపిరి పీల్చుకున్న అధికారులు

నవతెలంగాణ-ఆర్మూర్

రెండు, మూడు నెలల నుండి పార్లమెంట్ ఎన్నికల కోసం జిల్లా యంత్రాంగం కసరత్తు చేసి సోమవారం జరిగిన పోలింగ్‌తో సంబంధిత అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. గత మార్చ్ 17న పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చి, ఏప్రిల్ 18న నోటిఫికేషన్ విడుదల చేసినారు ..18 నుండి 25 వరకు నామినేషన్ల దరఖాస్తు స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. వివిధ రాజకీయ పార్టీల నాయకుల మైకుల శబ్దాలు ఆగిపోయాయి. వచ్చేనెల నాలుగున కౌంటింగ్ జరుగుతుండగా అభ్యర్థుల గుండెల్లో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది..

గత ఫిబ్రవరి నెల నుండి...

గత ఫిబ్రవరి నెలలో ఓటరు జాబితాను ప్రకటించిన అధికారులు ఈవీఎంల ఏర్పాట్లు పూర్తి చేశారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో పోలింగ్ కేంద్రాలను సైతం పరిశీలించారు. పోలింగ్ జరిగిన తర్వాత ఈవీఎంలను భద్రపరచి కౌంటింగ్ చేసేందుకు కేంద్రాలను సైతం అధికారులు ఏర్పాటు చేశారు. దీంతో పాటు ఈ ఎన్నికలకు కావలసిన ఏర్పాట్లను చేయడంతో పాటు ఉద్యోగులకు కావలసిన శిక్షణను సైతం అందించి పార్లమెంట్ పరిధిలోని సమస్యాత్మక, అతి సమస్యాత్మక కేంద్రాలను గుర్తించి ఎన్నికల కమిషన్ ముందు నివేదించారు.

ఎన్నికలకు అవసరమైన భద్రతా సిబ్బంది వివరాలను పంపించి ఇతర ఏర్పాట్లను సైతం అధికారులు నిర్విరామంగా చేశారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు శాసనసభ నియోజకవర్గాలో అసిస్టెంట్ ఎన్నికల అధికారులను, జోనల్ అధికారులను, సెక్టోరియల్ అధికారులను నియమించారు. 2014, 2019 పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ జరగగానే బ్యాలెట్ బాక్సును భద్రపరిచేందుకు జిల్లాలోని డిచ్‌పల్లి జాతీయ రహదారి పక్కన గల సిఎంసి భవనంలో భద్రపరిచారు. ఈ ఎన్నికల్లోనూ ఆ భవనంలోనే భద్రతకు కావలసిన అన్ని సౌకర్యాలు ఉండడంతో జిల్లా కలెక్టర్, నగర పోలీస్ కమిషనర్ పలు దఫాలుగా పరిశీలించి ఎన్నికల కమిషన్‌కు నివేదించి అనుమతులను సైతం తీసుకున్నారు. రెండు మూడు నెలల నుండి సంబంధిత శాఖల అధికారులు తలమునకలై, పార్లమెంటు పోరు ప్రశాంతంగా ముగియడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఇక అభ్యర్థులు భవితవ్యం ఈవీఎం యాల్లో నిక్షిప్తం కాగా, జూన్ 4కోసం వేచి చూడాల్సిందే.

నర్సుల సేవలు ఎనలేనివి



సన్మానించిన పలువురు

నవతెలంగాణ-పిట్లం

నర్సుల సేవలు ఎనలేనివని లయన్స్ క్లబ్ సభ్యులు అన్నారు.మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బం దికి నర్సింగ్ డే వారోత్సవాల సందర్భంగా 46 మంది వైద్య సిబ్బందికి, నర్సులకు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నర్సులు, వైద్య సిబ్బంది తమ ప్రాణాలను పనంగా పెట్టి రోగులకు నిర్విరామంగా సేవలు అందిస్తున్నారని వారు కొనియాడారు. వారి సేవలను గుర్తించి సత్కరించినట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కిషన్, కోశాధికారి కాశిరెడ్డి, సభ్యులు రాజుసేట్, శేఖర్ సెట్, సంతోష్ సెట్ , అఖిల్, సాయి, బాలు, డాక్టర్ శివకుమార్, హెడ్ నర్స్ శైలజ, పిహెచ్ఎన్ అన్వరి బేగం, సూపర్‌వైజర్ ప్రిసిల్లా, ఏఎన్ఎం, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

సంగారెడ్డికి తరలించిన ఈవీఎంలు

- పర్యవేక్షించిన జిల్లా కలెక్టర్



స్ట్రాంగ్ రూంలో భద్రపరిచిన ఈవీఎంలు

నవతెలంగాణ-కామారెడ్డి

లోక్‌సభకు జరిగిన ఎన్నికల ఈవీఎంలను జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆధ్వర్యంలో ప్రత్యేక వ్యాగిన్‌లో సంగారెడ్డికి సోమవారం తరలించారు. కామారెడ్డి, జుక్కల్, ఎల్లారెడ్డి సెగ్మెంట్‌ల ఈవీఎంలను సంగారెడ్డిలోని గీతం యూనివర్సిటీలో భద్రపరిచారు. ఈ కార్యక్రమంలో సాధారణ పరిశీలకులు గోపాల్ జి తివారి, జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి, కామారెడ్డి డిఎస్పి నాగేశ్వరరావు, దేవునిపల్లి ఎస్సై రాజు, సంబంధిత ఆర్డీవోలు ఉన్నారు.

గెలుపోటములపై పందెం

గెలుపుపై పార్టీల సర్వేలు

నవతెలంగాణ-మద్నూర్

గత నెల రోజుల నుంచి జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నిక పట్ల కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు అభ్యర్థుల గెలుపు కోసం ఎన్నికల ప్రచారం ముమ్మరంగా నిర్వహించారు.

జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నిక ఈనెల 13న జరగగా ఎన్నికలు ముగియగానే ఆయా పార్టీల హైకమాండ్ గెలుపు ఓటములపై అంచనాల సర్వేలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా జుక్కల్ సెగ్మెంట్లో ఏ పార్టీకి ప్రజలు మొగ్గు చూపారనేది మూడు పార్టీల నాయకులు మండలాల వారీగా నాయకులతో ఏ మండలంలో ఏ పార్టీకి ఏ గ్రామంలో ఏ పార్టీకి ప్రజలు ఓటు వేశారు?, మన పొజిషన్ ఎలా ఉంది.?, అనేది సర్వే అంచనాలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నెల 13న జరిగిన జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో జుక్కల్ సెగ్మెంట్‌లో ముఖ్యంగా కాంగ్రెస్, బిజెపి పార్టీల మధ్య ఎన్నికలు జరిగినట్లు జోరుగా చర్చలు వినబడుతున్నాయి. ఇక బిఆర్ఎస్ పార్టీ మూడో స్థానంలో ఉంటుందని చర్చలు వినబడుతున్నాయి. జుక్కల్ సెగ్మెంట్లో గెలుపు ఏ పార్టీది అనేది అంచనాలు వేయలేకపోతున్నారు. జుక్కల్ సెగ్మెంట్లో కాంగ్రెస్, బిజెపి పార్టీలు ఏ అభ్యర్థికి ఓట్లు అధికంగా వచ్చాయనేది ప్రస్తుతం చర్చల మూలంగా పక్కాగా చెప్పలేని పరిస్థితి. కాంగ్రెస్ బిజెపి పార్టీలు ఎన్నికలపై ఎక్కడ చర్చలు జరుపుతున్నారో కానీ బిఆర్ఎస్ పార్టీ జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికలకు జరిగిన జుక్కల్ సెగ్మెంట్లో ఏ మండలంలో ఎలాంటి పరిస్థితి కొనసాగిందనే దానిపై ఆ పార్టీ జుక్కల్ సెగ్మెంట్ ఇన్చార్జ్ జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హనుమంతుషిండే మద్నూర్ మండలంలోని లచ్చన్ గ్రామంలో మండలాల వారీగా నాయకులతో సర్వే అంచనాల కోసం ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహించినట్లు తెలుస్తోంది. ఏదేమైనా జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపు వరకు వేచి చూడాల్సిందే.



మాట్లాడుతున్న పలువురు

- ఎన్నిక పూర్తవడంతో అభ్యర్థుల్లో ఉత్కంఠ
- విజయం ఎవరికి వరించేనో..?

నవతెలంగాణ-నసురుల్లాబాద్

జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నిక కీలకంగా మారింది. జహీరాబాద్ పార్లమెంట్ ఎంపీ పదవి ఎవరికి ప్రజాతీర్పు దక్కనుందో ఎవరిని నిరాశ కలిగిస్తుందో తెలియని పరిస్థితి. కాంగ్రెస్, బీఆర్ఎస్, బిజెపి అభ్యర్థులు, వారి నాయకులు, అనుచరులు ఉదయం నుంచి వివిధ మందిరాల్లో పూజలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే ఎగ్జిట్ పోల్స్ వస్తున్నాయి. ఇందులో ఏ పార్టీకి సంపూర్ణ మద్దతు వస్తుందో తెలియక నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఆందోళనలకు గురవుతున్నారు. ఈ నియోజకవర్గంలో మెదక్ జిల్లాకు చెందిన 3 శాసనసభా నియోజకవర్గాలు (జహీరాబాద్, ఆందోల్, నారాయణ్‌ఖేడ్) ఉండగా కామారెడ్డి జిల్లాకు చెందిన కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్‌లతో కలిపి మొత్తం 7 శాసనసభా నియోజకవర్గాలుఉన్నాయి.

ఎస్సీలు 18 శాతం, ఎస్టీలు 8.4 శాతం, ముస్లిం 11.9 శాతం ఓటర్లు ఉన్నారు. జహీరాబాద్ పార్లమెంట్ ఎంపీ పదవి ప్రభావం ఎంత ఉందో అర్థమవుతుంది. ఇక ఎన్నికల ఫలితాల సమయం దగ్గరికొచ్చే కొద్దీ అన్ని పార్టీల అభ్యర్థుల్లో ఉత్కంఠ పెరిగిపోతుంది. జూన్ 4 సాయంత్రం వరకు ఎవరేంటి అనేది పూర్తిగా తేలిపోనుంది. జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బిజెపి మధ్య తీవ్ర పోటీ ఉంటుందని ఇందులో ఎవరో ఒకరు గెలుస్తారని ధీమాతో కొందరు వ్యాపారులు, నాయకులు పోటీపడి మరి పందేలు కాస్తున్నారు. కాంగ్రెస్, బిజెపి గెలిచే ప్రసక్తే లేదని బీఆర్ఎస్ ధీమా వ్యక్తం చేస్తుంది. జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నిక ఒకరికి మించి ఒకరు ప్రచారం చేశారు. ఓటర్లను సైతం ఆకర్షించేందుకు ఒకరి మించి ఒకరు ఖర్చు చేసినట్లు తెలిసింది.



సహకరించిన ప్రజలకు ధన్యవాదాలు : సిపి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్‌లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో నిజామాబాద్ లోకసభ పరిధిలో సార్వత్రిక ఎన్నికలకు జిల్లా ప్రజలు సహకరించినందుకు కమిషనర్ ఆఫ్ పోలీస్ కల్మేశ్వర్ సింగెనవర్ జిల్లా ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల సమయంలో ఎటువంటి గొడవలు, సమస్యలు తలెత్తకుండా ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు సమయానికి వచ్చి, ఓటు హక్కును వినియోగించుకున్నారని పేర్కొన్నారు. పోలీసు సిబ్బందికి శాంతియుతంగా జరిగేందుకు సహకరించిన జిల్లా ప్రజలందరికీ ధన్యవాదాలు తెలిపారు.

సీబీఎస్ఈ 10,12వ తరగతి ఫలితాల్లో నవోదయ వందశాతం


శ్రీకాంత్


విష్ణుప్రసాద్

నవతెలంగాణ-నిజాంసాగర్

సీబీఎస్ఈ విడుదల చేసిన 10వ, 12వ తరగతి ఫలితాలలో నవోదయ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి అద్భుత విజయాలను సాధించారు. నవోదయ పాఠశాలలో పదవ తరగతిలో 100శాతం, 12వ తరగతి ఫలితాలలో 100శాతం ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ సత్యవతి తెలిపారు. పదవ తరగతి ఫలితాల్లో విష్ణుప్రసాద్ 474-500 (94.8)మార్కులతో మొదటి స్థానంలో నిలిచాడని, 12వ తరగతి ఫలితాల్లో శ్రీకాంత్ 476-500(95.2) మార్కులతో మొదటిస్థానంలో నిలిచాడని ఆమె తెలిపారు. విద్యార్థులు సాధించిన విజయాలు వారి కృషికి నిదర్శనమని ఇందుకు ఉపాధ్యాయుల కృషి ప్రశంసనీయమని పాఠశాల అధినేత సత్యవతి అభినందించారు. విద్యార్థుల విజయానికి గర్వపడుతున్నామని విద్యార్థుల సంపూర్ణ అభివృద్ధికి పాఠశాల మూలమని ఆమె కొనియాడారు.

ఐఎఫ్ఎఫ్‌సిఓ జాతీయ డైరెక్టర్‌గా మార గంగారెడ్డి ఎన్నిక



డైరెక్టర్‌గా నియమకపత్రాన్ని అందుకుంటున్న మార గంగారెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

ఆసియా లోని ప్రసిద్ధిగాంచిన ఫర్టిలైజర్ కంపెనీ అయిన ఐఎఫ్ఎఫ్‌సి ఓ (ఇండియన్ ఫార్మర్స్ ఫర్టిలైజర్స్ కో-ఆపరేటివ్) జాతీయ డైరెక్టర్‌గా మండలంలోని అంకాపూర్ గ్రామానికి చెందిన మార గంగారెడ్డి ఎన్నికయ్యారు. తెలంగాణ రాష్ట్ర మార్క్‌ఫైడ్ చైర్మన్‌గా కొనసాగుతున్న ఆయన నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

ప్రమాదం అంచున ప్రయాణం



కూలిపోయిన కల్వర్టు గోడ

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

నాగిరెడ్డిపేట్ మండల కేంద్రం నుంచి చీనురువాడి వెళ్లే రహదారిపై ప్రయాణం ప్రమాదమంచున కొనసాగుతుంది. పోచారం ప్రధాన కాలువపై చీనూర్, వాడి వెళ్లే రహదారిపై కల్వర్టు నిర్మించారు. కల్వర్టుకు ఇరువైపులా గోడ నిర్మించారు. ఇటీవల గోడ కూలిపోయి రహదారి ప్రమాదకరంగా మారింది. మండల కేంద్రం నుంచి చీనూరు వెళ్లే రహదారిపై ఈ కల్వర్టు నిర్మాణం ఉండటంతో చీనూరు, వాడి, గోలిలింగాల్ మూడు గ్రామాల ప్రజలు ఈ కల్వర్టుపై నుంచి మండల కేంద్రానికి రాకపోకలు కొనసాగిస్తారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి కల్వర్టుకు ఇరువైపులా గూడా గాని రేలింగ్ గాని ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

భర్త మోసం చేశాడని భార్య ఆందోళన

- న్యాయం కావాలంటూ రోడ్డెక్కిన బాధితురాలు



బాధితురాలితో ఆందోళన చేస్తున్న మహిళలు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

కట్టుకున్న భర్త తనను మోసం చేశారంటూ భార్య ఆందోళనకు దిగింది. మహిళా సంఘాలతో కలిసి సదరు బాధితురాలు రోడ్డెక్కి ఆందోళన చేపట్టారు. వివరాలు ఇలా ఉన్నాయి.. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కోటగల్లి ప్రాంతానికి చెందిన సిరిపురం మనిష్విని 2016 మార్చ్ నెలలో సిరిపురం శ్రీనివాస్ అనే వ్యక్తితో పెళ్లి చేసుకుంది. అయితే తమ వివాహం అనంతరం అత్తగారు తన ఇంటిని బహుమతి ద్వారా తనకు ఇవ్వడం జరిగిందని మనిష్విని పేర్కొంది. అయితే ఇక్కడే తమకు సమస్య ఎదురైందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే ఇంట్లో గత కొన్ని సంవత్సరాలుగా తాను నివాసం ఉంటున్న అతను ఆమె తెలిపారు. తన భర్త శ్రీనివాస్ మొదటి భార్య అయిన సవిత ఎలాగైనా తన అత్తగారు తనకు ఇచ్చిన ఇంటిని స్వాధీన పరుచుకునేందుకు తనను బెదిరింపులకు తనను తన భర్త శ్రీనివాస్‌తో కలిసి బెదిరింపులకు దాడులకు పాల్పడుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అయితే తనకు జరిగిన అన్యాయానికి సవిత నివాసం ఉండే బొంబాయికి తాను వెళ్లి అక్కడ పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగిందని ఆమె అన్నారు. దీన్ని జిల్లా కోర్టు సుమోటాగా స్వీకరించిందని, అలాగే 4వ టౌన్ లో ఫిర్యాదు చేశామన్నారు. తాను ఫిర్యాదు చేయడాన్ని మనసులో పెట్టుకున్న సవిత ఆమె అనుచరులు గత శనివారం మధ్యాహ్నం తన ఇంటిపై దాడి చేసి నాపై, బంధువులపై అకారణంగా దాడికి దిగారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనంతటికీ తన భర్త శ్రీనివాస్ కుట్ర పన్నుతున్నారని ఆమె ఆరోపించారు. విషయాన్ని తెలుసుకున్న ఆశాజ్యోతి మహిళా సంఘం అధ్యక్షురాలు ఏకే లత కొంతమంది మహిళలు కలిసి మంగళవారం ఆందోళన చేపట్టారు.

వరికోత మిషన్ ఢీ..

- గాయాలపాలైన వ్యక్తి



గాయాలపాలైన వ్యక్తిని అంబులెన్స్‌లో తీసుకెళ్తున్న దృశ్యం

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని మర్కల్ గ్రామానికి చెందిన మర్కంటి తిరుపతి మంగళవారం వరికోత మిషన్ ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. గ్రామస్తుల వివరాల ప్రకారం.. వరికోత కోస్తుండగా తిరుపతి మిషన్ వెనుక నిలబడటంతో మిషన్ రివర్స్ తీసుకునే క్రమంలో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. గ్రామంలోని రైతులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. వెంటనే అంబులెన్స్ సిబ్బంది రాజేందర్, సంజీవ్ పొలంవద్దకు వచ్చి క్షతగాత్రున్ని ప్రథమ చికిత్స నిర్వహిస్తూ కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

తూకం వేసిన ధాన్యాన్ని రాత్రి ఆలస్యమైనా లిఫ్ట్ చేయాలి

- అదనపు కలెక్టర్ చంద్ర మోహన్

నవతెలంగాణ-కామారెడ్డి

బుధవారం, గురువారం జిల్లాలో ఈదురు గాలులతో కూడిన ఓ మోస్తరు వర్షాలు పడతాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ధాన్యాన్ని రాత్రి పొద్దుపోయాక కూడా లిఫ్ట్ చేయవలసినదిగా అదనపు కలెక్టర్ చంద్ర మోహన్ నిర్వాహకులకు సూచించారు. మంగళవారం కామారెడ్డి పట్టణంలోని శాబ్దిపూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని, క్యాసంపల్లిలో ఓం శ్రీ వెంకటేశ్వర బాయిల్డ్ రైస్‌మిల్లును, పాల్వంచ మండలంలోని భావనిపేటలో భూలక్ష్మి రైస్‌మిల్, గాయత్రీ బాయిల్డ్ రైస్ మిల్లులను జిల్లా పౌర సరఫరాల అధికారి మల్లికార్జున్ బాబుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే రెండు రోజులు వర్షాలు కురిసే సూచనలున్నందున ధాన్యం రాశులను త్వరగా తూకం వేసి మిల్లులకు తరలించాలన్నారు. రైతులకు అవసరమైన టార్పాలిన్లు అందించాలని, మౌలిక వసతులు కల్పించాలని నిర్వాహకులకు సూచించారు. రైతులు తమ ధాన్యం కుప్పలపై టార్పాలిన్లు కప్పి ఎగిరిపోకుండా చూసుకోవాలని కోరారు. వర్షాలు కురుస్తాయని రైతులు అధైర్యపడవద్దని తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేసి బాయిల్డ్ మిల్లులకు తరలిస్తామని చెప్పారు. తడిచిన ధాన్యాన్ని ఆరబెట్టి తేమశాతం తగ్గేలా చూడాలన్నారు. అనంతరం బాయిల్డ్, రా రైస్ మిల్లులను సందర్శించి అక్కడ వేచి ఉన్న లారీలలో ధాన్యాన్ని వెంటనే అన్‌లోడ్ చేసుకోవాలని, ట్రక్ షీట్ జారీచేయాలన్నారు. రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా మిల్లులకు వచ్చిన లారీలను 24 గంటలలోగా అన్‌లోడ్ చేసుకొని త్రిప్పి పంపితే తిరిగి కొనుగోలు కేంద్రాలలో ధాన్యం లోడింగ్ చేసి పంపడానికి అవకాశముంటుందని అన్నారు. ఈ రబీ సీజన్‌లో ఇప్పటి వరకు 42,142 మంది రైతుల నుంచి 526 కోట్ల విలువ గల 2,38,488 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి ట్యాబ్ ఎంట్రీ త్వరితగతిన చేస్తూ 84 శాతం మేర 441 కోట్లు రైతుల ఖాతాలో జమచేశామని చేశామని అన్నారు. మిగతా డబ్బులు రైతుల ఖాతాలో త్వరలో జమచేస్తామని చంద్ర మోహన్ తెలిపారు. వడ్ల కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతం చేస్తూ త్వరగా డబ్బులు ఖాతాలో జమచేస్తుండడం పట్ల రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పౌర సరఫరాల ఉప తహసీల్దార్లు పాల్గొన్నారు.



ధాన్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రమోహన్

గుంతలమయంగా మారిన బీటీ రోడ్లు

- నత్తనడకన సాగుతున్న బైపాస్ రహదారి విస్తరణ పనులు



గుంతల మయంగా మారిన బీటీ రోడ్డు

నవతెలంగాణ-బోధన్

సాలూర మండలం సాలంపాడ్ క్యాంప్ నుంచి నాగన్‌పల్లి వరకు ఉన్న అంతర్గత బీటీ రోడ్డు గుంతలమయంగా మారింది. దాంతో ఈ రహదారి గుండా నాగన్‌పల్లి, సాలంపాడ్‌కు వెళ్లే వాహనదారులు గుంతలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే నాగన్‌పల్లి సమీపంలో వంతెన దగ్గర నుంచి గ్రామం చివరి వరకు అంతరాష్ట్ర రహదారి పెద్ద పెద్ద గుంతలు కావడంతో వాహనదారులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. దాంతో పలుమార్లు వాహనాలు చెడిపోయి వాహనదారులు నష్టాలకు గురవుతున్నారు. నూతనంగా నిర్మిస్తున్న బైపాస్ రహదారి నిర్మాణం పనులు నత్తనడకన కొనసాగడంతో తప్పని పరిస్థితుల్లో వాహనదారులు గుంతల్లో రోడ్లపై నుంచి వెళ్లే పరిస్థితి తలెత్తింది. అధికారులు బైపాస్ రహదారిని త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తేవాలని వాహనదారులు కోరుతున్నారు. అలాగే గుంతలమయమైన రహదారిని తక్షణమే మరమ్మతులు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

నేను పక్కా లోకల్

- బాన్సువాడ నా ఇల్లు, ప్రజలే నా కుటుంబం
- మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి

నవతెలంగాణ-నసురుల్లాబాద్

నేను పక్కా లోకల్ అని.. బాన్సువాడనే నా ఇల్లు, ప్రజలేనా కుటుంబమని మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. హోరాహోరీగా ప్రచారం సాగి సోమవారం ఎన్నికలు ముగియడంతో మాజీ స్పీకర్, బాన్సువాడ నియోజకవర్గ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి తన మిత్రులతో కలిసి సరదాగా బాన్సువాడ పట్టణంలో పర్యటించారు. ప్రజలతో, మిత్రులతో కలిసి టీ కొట్టులో టీ తాగారు. ఆదివారం వరకు ఎన్నికల బిజీతో క్షణం తీరిక లేకుండా ఉన్న మాజీ శాసనసభ సభాపతి, మాజీ మంత్రి, బాన్సువాడ నియోజకవర్గ శాసనసభ్యులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం బాన్సువాడ పట్టణంలోని టీస్టాల్ లో అలా ప్రశాంతంగా చాయ్ తాగుతూ ఎన్నికలు ఉన్నా లేకపోయినా నేను మాత్రం బాన్సువాడ లోకల్ అం టూ మిత్రులతో ముచ్చటించారు. బాన్సువాడ పాత మున్సిపల్ కాంప్లెక్స్‌లో ఉన్న ఇమ్రాన్ టీ హోటల్‌కు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో వెళ్లిన పోచారం ఇతర టీ తాగేవారితో చాయ్ తాగుతూ ముచ్చట్లు పెట్టారు. 'ఎన్నికలు వస్తాయి పోతాయ్, బయటి నాయకులు, అభ్యర్థులు ఓట్లు అయిపోగానే వాళ్ళ ఊరికి పోతారు. నాకు మాత్రం బాన్సువాడే నా ఊరు, ఇదే నా ఇల్లు, బాన్సువాడ ప్రజలే నా కుటుంబం..' అంటూ చాయ్‌ని ఆస్వాదించారు. 'కొందరు అభ్యర్థులు, నాయకులు ఇతర ప్రాంతాల నుంచి వచ్చి ప్రజలను మభ్యపెట్టి ఆశలు చూపి ఎన్నిక కాగానే చేతులు దులుపుకొని వెళ్ళిపోతారు. కానీ నేను గత 35 ఏండ్లగా లోకల్ లోనే ఉంటూ ప్రజల కష్ట సుఖాలను చూస్తున్నా' అని ఆయన అన్నారు. పోచారం వెంట బాన్సువాడ మున్సిపల్ చైర్మన్ గంగాధర్, కృష్ణారెడ్డి, మైనార్టీ నాయకుడు వహాబ్ సాబ్, నార్ల రవీందర్, ఏజాజ్ తదితరులున్నారు.

లక్షా 30 వేల మెజారిటీతో గెలవడం ఖాయం

- ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని, అదేవిధంగా నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి జీవన్ రెడ్డికి లక్షా 30 వేల మెజారిటీ రావడం ఖాయమని బోధన్ ఎంఎల్ఏ సుదర్శన్ రెడ్డి అన్నారు. మంగళవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సుదర్శన్ రెడ్డి, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్ రెడ్డి మాట్లాడారు. సోమవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో నిజామాబాద్ పరిధిలో ఆశించిన స్థాయిలో ఓటింగ్ శాతం పెరిగిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ సుపరిపాలన, మచ్చలేని నాయకుడు జీవన్ రెడ్డి అభ్యర్థి కావడం కాంగ్రెస్‌కు ప్లస్ పాయింట్, వీటికి తోడు అభ్యర్థి గుణగణాలు చూసి ప్రజలు కాంగ్రెస్‌కు ఓటేశారన్నారు. బీఆర్ఎస్ బీజేపితో కుమ్మక్కయినప్పటికి కాంగ్రెస్ లక్షా 50 వేల మెజారిటీతో నిజామాబాద్ పార్లమెంట్లో గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల్లో సహకరించిన సిపిఐ, సిపిఐఎం,సిపిఐఎంఎల్ తదితర పార్టీలకు కృతజ్ఞతలు తెలిపారు. టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్, సీనియర్ కాంగ్రెస్ నేతలతో పాటు కార్యకర్తలు కాంగ్రెస్ గెలుపు కోసం కృషి చేశారన్నారు. నిజామాబాద్ ప్రాంతం మతసామరస్యానికి ప్రతీక అని, మతవిద్వేషాలు రెచ్చగొట్టాలని కొందరు చూసినా ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయన్నారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిజామాబాద్ ప్రాంతాన్ని నిర్లక్ష్యం చేశాయన్నారు. వంద శాతం లక్ష పైచిలుకు మెజారిటీతో తాను గెలుస్తానని అన్నారు. పార్లమెంటు ఎన్నిక జిల్లా అభివృద్ధి విషయంలో కాంగ్రెస్ బాధ్యతను మరింత పెంచిందన్నారు. ఈ పార్లమెంటు ఎన్నికల్లో ఉత్తర భారతంలో బిజెపి ఉనికి కోల్పోతుందని, రాష్ట్రంలో డబుల్ డిజిట్ ఎలా సాధిస్తుందని అన్నారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి, బాల్కొండ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ సునీల్ రెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహర్ బిన్ హందాన్, మాజీ ఎమ్మెల్సీలు ఆకుల లలిత, రాజేశ్వర్ రావు, సీనియర్ నాయకులు అరికెల నర్సారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి

23, 24 శ్రీలక్ష్మీనారాయణ రథోత్సవాలు

నవతెలంగాణ-మద్నూర్

మండల కేంద్రంలోని రథంగల్లీలో గల శ్రీ లక్ష్మీనారాయణ రథోత్సవాలు ఈనెల 23, 24 రెండు రోజులపాటు జరుపనున్నారు. ప్రతి సంవత్సరం బుద్ధ పౌర్ణమి రోజున జరిపే రథోత్సవానికి శ్రీ లక్ష్మీనారాయణ ప్రతాన్ని మంగళవారం సాయంత్రం బయటకు తీశారు. ఈనెల 23న రాత్రి పౌర్ణమి రోజున ప్రతాన్ని ఊరేగిస్తారు. ఈనెల 24న ఉదయం నుంచి సాయంత్రం వరకు కుస్తీ పోటీలను నిర్వహించనున్నారు. అలాగే ఆలయంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం చేపట్టనున్నారు.

పారిశుధ్య కార్మికులకు పండ్లు పంపిణీ



నవతెలంగాణ-సదాశివనగర్

మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులకు మంగళ వారం పండ్లను కాంగ్రెస్ పార్టీ నాయకుడు బంటు భూమేష్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి జన్మదినం సందర్భంగా పండ్లు పంపిణీ చేసినట్టు వివరించారు.